క్లుప్తంగా

నేడు సమాచారం హక్కు చట్టంపై అవగాహన

కొల్లూరు: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై మండల స్థాయి అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించనున్నట్లు ఏఈ ఆర్. వెంకటేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న సదస్సుకు మండలంలోని ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొనాలని కోరారు.

విధుల నుంచి తహసీల్దార్ రిలీవ్

కర్లపాలెం: విధి నిర్వహణలో రెవెన్యూ కార్యాలయ సిబ్బంది అందించిన సహకారం మరువలేనిదని తహసీల్దార్ నిర్మలానందబాబా పేర్కొన్నారు. ఎన్నికల విధులు నిర్వహించేందుకు మండలానికి వచ్చిన తహసీల్దార్‌లను గతంలో వారు పనిచేసిన మండలాలకు వెళ్లాలని ప్రభుత్వం ఆదేశాలివ్వటంతో కర్లపాలెం తహసీల్దార్‌గా ఇప్పటి వరకు విధులు నిర్వహించిన నిర్మలానందబాబా విధుల నుంచి రిలీవ్ అయ్యారు. డీటీగా పనిచేస్తున్న సలీమాకు బాధ్యతలు అప్పగించారు.

రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పున్నారావు



చెరుకుపల్లి: రేషన్ డీలర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా నాగుల పున్నారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో అసోసియేషన్ సమావేశం సోమవారం నిర్వహించారు. పున్నారావు ఎన్నికపై పలువురు అభినందనలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 2 అర్జీలు

భట్టిప్రోలు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 2 అర్జీలు వచ్చినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు తెలిపారు. పెసర్లంకలో ఆక్రమణలు తొలగించాలని, భట్టిప్రోలులో ఓ మహిళ నుంచి చేనేత పింఛన్ మంజూరు చేయాలని అర్జీలు అందాయన్నారు. ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవచ్చని కోరారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులంతా పాల్గొంటారని తెలిపారు.

బీర్ బాటిల్‌తో వ్యక్తిపై దాడి

బాపట్లటౌన్: బీర్ బాటిల్‌తో వ్యక్తిపై దాడిచేసిన ఘటన పట్టణంలోని ఊర్వశి బార్ సమీపంలో చోటుచేసుకుంది. పట్టణంలోని రైలుపేట రాజీవ్ నగర్ కాలనీకి చెందిన ఎస్.ఆంజనేయులు, అతని స్నేహితుడు చిన్ని ఊర్వశి బార్ సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్నారు. మద్యం మత్తులో ఉన్న వెంకయ్య పిలిస్తే పలకడం లేదంటూ ఆంజనేయులుపై బీర్ బాటిల్‌తో దాడిచేశాడు. అతడి మొహంపై, ముక్కుపై రక్తగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలలో చేర్చారు. ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మునిగిన వరిలో సస్యరక్షణ చర్యలు

చుండూరు(వేమూరు): అల్పపీడనం ప్రభావంతో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పొలాలను మండల వ్యవసాయాధికారి ఆదాం బాబు సోమవారం పరిశీలించారు. చుండూరు మండలం మోదుకూరు గ్రామంలోని మునిగిపోయిన వెద పద్ధతిలో వరిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. వెద వరి విత్తుకుని మొలకరాని పొలాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపితే మొలక రావడానికి అవకాశం ఉందన్నారు. వెద వరి విత్తనాలు 10 నుంచి 30 రోజులయిన పొలాల్లో నిల్వ ఉన్న నీటిని తీసి వేయాలి, వర్షాలు తగ్గిన తర్వాత ఒక బస్తా డీఏపీ, 20 కిలోలు యూరియా, 20 కిలోలు మ్యూరెట్ ఆఫ్ పొటాష్ ఎరువులు వేయాలని ఆయన తెలిపారు.

శాకంబరిగా పోలేరమ్మ తల్లి



బాపట్లటౌన్: బాపట్ల గ్రామ దేవత పోలేరమ్మ తల్లిని సోమవారం శాకంబరి దేవిగా అలంకరించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారు బుధవారం వరకు ఇదే అలంకరణలో భక్తులకు దర్శనం ఇస్తారని దేవాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం రాత్రి దేవస్థానం కమిటీ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వరి నారుమళ్ల పరిశీలన



చెరుకుపల్లి: వరి నారుమళ్లల్లో మొదటి నుంచే కలుపు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి టి.బాలాజీ గంగాధర్ చెప్పారు. మండలంలోని రాంబొట్ల పాలెంలో నారుమళ్లను సోమవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. తగిన సస్యరక్షణ చర్యలు సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ఆర్డీఓ హెలా షారోన్



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీఓ హెలా షారోన్

రేపల్లె రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ హెలా షారోన్ అన్నారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు అందాయన్నారు. నీటి కనెక్షన్ కోసం రేపల్లె మండలం కైతేపల్లి నుంచి మేరుగ ప్రసాద్ అర్జీ అందించగా. దోమా యాకోబ్ అనే వ్యక్తి గృహాల మధ్య గొర్రెలు, మేకలు వంటి వాటిని పెంచటంతో వాటి నుంచి వచ్చే వ్యర్థాలతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రిపాలెం గ్రామ ప్రజలు అర్జీ అందించారన్నారు. తన స్థలం కబ్జాకు గురైందని నల్లూరునార్త్ గ్రామానికి చెందిన సజ్జా జయమ్మ ఫిర్యాదు చేయగా, పోటుమెరక గ్రామంలో కొసరాజు త్రిమూర్తిరాజు, ముదునూరి నరసింహారావు అనే వ్యక్తులు రొయ్యల చెరువులు సాగు చేయటంతో పంట పొలాలు దెబ్బతింటున్నాయని సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు అర్జీ అందించారన్నారు. తుమ్మల, పోటు మెరక, మోళ్లగుంట గ్రామ ప్రజలు పీడబ్ల్యూ కాల్వ ద్వారా వచ్చే నీరు సముద్రంలోకి వెళ్లకుండా ఆపుతున్నారని సమస్యను పరిష్కరించాలని ఎగువ గ్రామాల ప్రజలు అర్జీ అందించారన్నారు. సమస్యలను ఆయా శాఖల అధికారుల ద్వారా త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఇసుక అక్రమ రవాణాపై దృష్టి పెట్టండి



గాజుల్లంక కృష్ణానదీ తీరంలో సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్

కొల్లూరు: ప్రభుత్వ యంత్రాంగం ఎటువంటి ఉదాసీనతకు తావివ్వకుండా ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంపై దృష్టి సారించాలని కొల్లూరు తహసీల్దార్ పుల్లారావు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని గాజుల్లంక కృష్ణా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని ఆయన దృష్టికి రావడంతో నదిని పరిశీలించారు. నదీ తీరం వద్ద రెవెన్యూ, పోలీసు, సెబ్ యంత్రాంగాన్ని పహారాగా ఉంచినప్పటికీ అక్రమంగా ఇసుక తరలడంపై సిబ్బందిని ప్రశ్నించారు. నదిలోకి ట్రాక్టర్లు దించి ఇసుకను తరలిస్తున్న వ్యక్తులను అడ్డుకోవాలని, వారు ప్రభుత్వ యంత్రాంగం ఆదేశాలను బేఖాతరు చేసి నదిలో ఇసుక తవ్వకాలు చేపట్టిన పక్షంలో వారి వివరాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. ప్రభుత్వం ఉచిత ఇసుక అందుబాటులోకి తీసుకొచ్చిన నేపథ్యంలో ఇసుక ఇష్టానుసారం తరలించడం సాధ్యపడదని, ప్రభుత్వం నిర్దేశించిన స్టాక్ పాయింట్ల నుంచి మాత్రమే ఇసుక రవాణా చేయాలని అన్నారు. నదిలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు నియమించిన సిబ్బంది సైతం తమ విధులను సక్రమంగా నిర్వర్తించకపోవడం, విధులకు హాజరవ్వకుండా ఇసుక అక్రమ రవాణా జరగడానికి కారణం అయినట్లయితే సంబంధిత శాఖాధికారులకు ఫిర్యాదు చేసి వారిపై శాఖాపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ గంగాధర్, ఏఎస్ఐ రామయ్య, ఆర్ఐ త్రివేణి, వీఆర్ఓలు పాల్గొన్నారు.

బీసీ గురుకులంలో సమస్యలు పరిష్కరించాలి

నిజాంపట్నం: బీసీ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా అధ్యక్షుడు ఎన్.శివశంకరరావు కోరారు. సోమవారం తహసీల్దార్ నారాయణ రెడ్డికి వినతిపత్రం అందించి మాట్లాడారు. నిజాంపట్నం బీసీ గురుకుల పాఠశాలలో కొన్ని రోజులుగా ఆర్వోప్లాంట్ పనిచేయకపోవడంతో విద్యార్థులు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే ఆర్వోప్లాంట్ రిపేరు చేయించి విద్యార్థుల తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా పాఠశాలలో వంటశాల, మరుగుదొడ్లు భవనాల పెచ్చులు ఊడిపడటంతో విద్యార్థులు భయాందోళనకు గురౌతున్నారని చెప్పారు. అధికారులు పరిశీలించి మరమ్మతులు చేయించాలని కోరారు. అదేవిధంగా భోజనం ఏర్పాటు కోసం ఉపయోగించే సామగ్రి బాగా పాతవి కావడం వల్ల అన్నం మాడిపోతుందని, విద్యార్థులు మాడిన వాసన రావడంతో అన్నం తినేందుకు ఇబ్బందికి గురౌతున్నారని అందువల్ల కొత్త పాత్రలు కొనుగోలు చేసి ఇవ్వాలని కోరారు. అదేవిధంగా మరుగుదొడ్లకు డోర్లు లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వినతి పత్రం అందిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కె.విజయ లక్ష్మణ్, గణేష్ తదితరులున్నారు.

హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే చర్యలు తప్పవు



అవగాహన ర్యాలీ చేపడుతున్న పోలీసులు

బాపట్లటౌన్: ద్విచక్రవాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించాలని ట్రాఫిక్ ఎస్ఐ సుధాకర్ తెలిపారు. మండల న్యాయ సేవాధికార సంస్థ, పట్టణ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం హెల్మెట్ లేని ప్రయాణం వల్ల కలిగే ఇబ్బందులపై వాహన చోదకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్ఐ సుధాకర్ మాట్లాడుతూ హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమన్నారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. మోటార్ వాహనాల ప్రమాదాల్లో హెల్మెట్ లేని కారణాలతోనే అధిక శాతం మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ఈ మరణాలను నివారించడానికి హెల్మెట్ వాడకం ఉపయోగపడుతుందన్నారు.కార్యక్రమంలో బాపట్ల ట్రాఫిక్ పోలీసులు, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


ఆర్థిక సాయం

నల్లమోతువారిపాలెం(కర్లపాలెం): ఏ మనిషికైనా అంతిమ సంస్కారాలకు ఎలాంటి లోటు లేకుండా గౌరవంగా జరిగాలని నల్లమోతువారిపాలెం సర్పంచి మాడా సుబ్రమణ్యం తెలిపారు. నల్లమోతువారిపాలెంలో ఆదివారం మృతిచెందిన బడుగు వెంకటేశ్వర్లు భౌతికకాయానికి సోమవారం నివాళులర్పించి అంత్యక్రియలకు వైఎస్సార్ సీపీ నాయకులకు, మాడా వెంకట సుబ్బారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.5 వేల నగదు అందజేశారు. ఈసందర్భంగా వైఎస్సార్ సీపీ దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య మాట్లాడారు. కార్యక్రమంలో పెదగొల్లపాలెం సర్పంచ్ యల్లావుల సురేష్ రాదవ్, సమ్మెటవారిపాలెం మాజీ సర్పంచి సమ్మెట వెంకటేశ్వర రెడ్డి, మండల కో ఆప్షన్ మాజీ సభ్యుడు షేక్ తాజుద్దీన్, గరిగంటి కిరణ్, సూరగాని వెంకటేశ్వర్లు, రాంబాబు, వీర్లంకయ్య, భాస్కర్, శివయ్య తదితరులు ఉన్నారు.

టీచ్ టూల్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

తెనాలిఅర్బన్: టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులంతా సద్వినియోగం చేసుకోవాలని కార్యక్రమ రాష్ట్ర పరిశీలకులు శారద, అఖిల్, మేరీలు పేర్కొన్నారు. కొత్తపేటలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోధనలో ఉపాధ్యాయులకు సహకారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. బోధనలోని మెళకువలను శిక్షణలో తెలియజేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో పలువురు విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన విద్యా వారోత్సవాలు



వరహాపురం బోధన సామగ్రి ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వేమూరు: కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు జాతీయ విద్యా విధానం ప్రవేశ పెట్టి 4వ వార్షికోత్సవం సందర్భంగా అన్ని పాఠశాలల్లో శిక్షాసప్తాస్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని మండల విద్యా శాఖాధికారి ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వేమూరు మండలంలోని అన్ని ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో నూతన విద్యా వారోత్సవాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యా వారోత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి 28 వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. సోమవారం స్థానిక వనరులతో బోధన అభ్యసన సామగ్రి తయారు చేసి ప్రదర్శించడం జరిగిందన్నారు. పరివర్తనాత్మక సంస్కరణలపై దేశ వ్యాప్తంగా విద్యాభివృద్ధి చేయడంతో నిబద్ధతను తెలియజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు

ఐసీఆర్‌పీ సౌజన్య



వరి విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధి చేస్తున్న దృశ్యం

పిట్టలవానిపాలెం: సుస్థిర సేంద్రియ వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని ఐసీఆర్‌పీ సౌజన్య తెలిపారు. మండల కేంద్రంలోని పిట్టలవానిపాలెం గ్రామంలో సోమవారం సుస్థిర సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుస్థిర సేంద్రియ వ్యవసాయం అవలంభించడం వల్ల తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చని సూచించారు. మండలంలో ఇప్పటికే అనేక మంది రైతులు సేంద్రియ వ్యవసాయం పట్ల ఆసక్తి చూపుతుతున్నారని తెలిపారు. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల వినియోగించుట వలన ఆరోగ్యవంతంగా జీవించవచ్చని తెలిపారు. ఇందులో భాగంగా వరి విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధి చేశారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా శ్రీనివాసరావు



వేమూరు: ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఎస్. శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ పని చేసిన జె.కిరణ కుమార్ ప్రకాశ్ జిల్లాకు బదిలీ చేశారు. సార్వత్రిక ఎన్నికలకు ప్రకాశం జిల్లా నుంచి బదిలీపై వేమూరు వచ్చారు. సార్వత్రిక ఎన్నికలు పూర్తయిన తర్వాత తహసీల్దార్లు బదిలీ చేపట్టారు. జె.కిరణ కుమార్‌ను ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు. ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న శ్రీనివాసరావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

గురుపౌర్ణమి పురస్కారాలు అందజేత



తెనాలిరూరల్: తెనాలి మండలం అంగలకుదురు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో రావినూతల సాంబశివరావు స్మారక మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలతో పాటు విద్యార్థులలో మ్యాథ్స్ విజ్ఞానం, సృజనాత్మకంగా ఆలోచించే వారికి బహుమతులు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెని క్రిస్టినా పాల్గొన్నారు. ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలను జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టినా అభినందించారు. సభకు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శాఖమూరి నారాయణ ప్రసాద్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, గ్రామ ఉప సర్పంచి కనగాల నాగభూషణం, గరికపాటి సుబ్బారావు, అబ్బరాజు తిమ్మరసు, ఆర్ ప్రకాష్ తదితరులు ప్రసంగించారు. ప్రతిభ కనబరిచిన 25 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, బహుమతులను అంద జేయడంతో పాటు ఉపాధ్యాయులు లక్ష్మీఅన్నపూర్ణ, అల్లం వెంకట నారాయణ, పీఏఎస్ మహలక్ష్మి, అబ్దుల్ కరీంను సన్మానించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న స్వరలయ వ్యవస్థాపకులు లక్కరాజు సాయి, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ మధుబాబు, కళాకారులు వేమూరి విజయభాస్కర్, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, హరికథా భాగవతార్ రాధాకృష్ణమూర్తి పేరిట ఆయన కుమారుడు శ్రీనివాస్‌కు విశిష్ట పురస్కారాలు అందజేశారు. కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయిని అనురాధ, గ్రామ ఉప సర్పంచ్ కనగాల నాగభూషణం, ఆర్.ప్రకాష్, శివప్రసాద్, రాజేష్ పర్యవేక్షించారు.

రెండో విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకోండి

తెనాలిఅర్బన్: జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 27న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్, తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రావి చిన వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో ప్రవేశం పొందగోరే విద్యార్థులు ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఐటీఐ.ఏపీ.జీవోవి.ఆన్ వైబ్ సైట్‌లో గానీ, తెనాలి, గుంటూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాలలో తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. 24వ తేదీ లోపు తమ సర్టిఫికెట్లను నమోదు కేంద్రాల్లో వెరిఫై చేయించుకోవాలన్నారు. 27వ తేదీ ఉదయం 9 గంటకు తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కౌన్సెలింగ్ జరుగుతుందని చెప్పారు. ప్రైవేట్ కళాశాలల్లో చేరదలచిన వారు 29, 30 తేదీలలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని వివరించారు. వివరాలకు 93477 95839, 63045 72793 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

వైఎస్సార్ సీపీ వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు



దోనేపూడిలో మృతి చెందిన కార్యకర్త భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న అశోక్‌బాబు

కొల్లూరు: కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ పాలనను చూసి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అధైర్య పడొద్దని తాను ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తానని వేమురు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. సోమవారం మండలంలోని దోనేపూడి మగ్గాలపాలెంలో అనారోగ్యం కారణంగా మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కర్రా చింతయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ క్రియాశీలక కార్యకర్తలు మరణించడం పార్టీకి తీరని లోటని అన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి పాలవ్వడం పట్ల ఏ కార్యకర్త అధైర్యపడాల్సిన అవసరం లేదని ధైర్యంగా ఉండాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అరాచక పాలన చేస్తున్న తరుణంలో అడ్డుకోవడంలో పోలీసు యంత్రాంగం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెనిగళ్ల శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు

రేపల్లె రూరల్: విద్యార్థులకు వ్యాధుల పట్ల అవగాహన ఉండాలని మలేరియా సబ్ యూనిట్ సూపర్‌వైజర్ ఎం.యల్లయ్య అన్నారు. డెంగీ మాసోత్సవాలలో భాగంగా పట్టణంలోని 11వ వార్డు ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూలులో సోమవారం విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించి అనంతరం మాట్లాడారు. ఏ మాత్రం అనారోగ్య సమస్య తలెత్తినా వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందాలన్నారు. నివాస పరిసర ప్రాంతాలలో నీటి నిల్వలు, తేమ వాతావరణం లేకుండా చూసుకోవాలన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఆరోగ్య సూత్రాలు విధిగా పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. భోజనం తీసుకునేటప్పుడు చేతులను సబ్బుతో పరిశుభ్రం చేసుకోవాలని చెప్పారు. నిద్రించే సమయంలో దోమ తెరను వినియోగించాలన్నారు. ఫలితంగా దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగీ, ఫైలేరియా, మెదడు వాపు వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో మలేరియా యూనిట్ సూపర్‌వైజర్ జీ.చక్రధర్, డీపీఎంవో ఎన్. సారంగపాణి, హెచ్ఎం ఎం.ప్రవీణ, ఏఎన్ఎం, ఆశాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాలు తెలియాలి



బాల వికాస్ కేంద్రాన్ని ప్రారంభించిన ఫౌండేషన్ సభ్యులు

రేపల్లె రూరల్: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకోవాలని బాల వికాస్ జిల్లా సంయోజక్ యల్లాప్రగడ సీతాపతి అన్నారు. రేపల్లె పట్టణం 1వ వార్డులోని సీతారామ మందిరంలో సోమవారం ఆయన బాల వికాస్ కేంద్రాన్ని ప్రారంభించి అనంతరం మాట్లాడారు. టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులతో సమరసత సేవాఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మాణాలు జరిగిన దేవాలయాలలో ఈ బాల వికాస్ కేంద్రాలను ప్రారంభించినట్లు చెప్పారు. కేంద్రాలలో ఆచార సంప్రదాయాలను తెలియజెప్పటంతో పాటు పద్యాలు, శ్లోకాలు, పాటలు నేర్పించటం జరుగుతుందన్నారు. సృజనాత్మక శక్తిని పెంపొందించేలా ఈ కేంద్రాలు పనిచేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పేరం కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు నంబూరు వేణు, వెంకటేశ్వరరావు, రమాదేవి, ధర్మ ప్రచారక్‌లు జంజనం హేమశంకరరావు, చింతల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని వినతి



కొల్లూరు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్టీ సామాజికవర్గ కుటుంబాలు

కొల్లూరు : తమ కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని అర్థిస్తూ ఎస్టీ సమాజిక వర్గ కుటుంబాల సభ్యులు తహసీల్దార్ పుల్లారావుకు వినతి పత్రం అందజేశారు. సోమవారం కొల్లూరు రెవెన్యు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మండలంలోని చిలుమూరులంకలో గత 13 ఏళ్లుగా నివసిస్తున్న ఎస్టీ సామాజిక వర్గ కుటుంబాలు తహసీల్దార్ వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. తాము 13 ఏళ్లుగా చిలుమూరులంకలో నివసిస్తున్న తమకు ఆధార్, రేషన్ కార్డులు లేకపోవడంతో తమకు గుర్తింపు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబాలకు రేషన్, ఆధార్ కార్డులు మంజూరు చేసి ప్రభుత్వ పథకాలకు అర్హులుగా చేయాలని వేడుకొన్నారు. నివేశనా స్థలాలు మంజూరు చేయడంతో పాటు పక్కా గృహాల నిర్మాణాలకు అవకాశం కల్పించాలని మొరపెట్టుకున్నారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని తహసీల్దార్ పుల్లారావు పేర్కొన్నారు.

తైక్వాండో పోటీల్లో నిజాంపట్నం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న రాష్ట్ర తైక్వాండో ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు

నిజాంపట్నం: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో నిజాంపట్నం బోధి ధర్మ తైక్వాండో అకాడమీ విద్యార్థులు 13 స్వర్ణ పతకాలు 8 రజిత పతకాలు, 3 కాంస్య పతకాలు సాధించినట్లు రాష్ట్ర తైక్వాండో ప్రధాన కార్యదర్శి మాస్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం నిజాంపట్నంలో పలు పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. మాస్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 19, 20 తేదీల్లో రేపల్లెలో రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పోటీల్లో నిజాంపట్నం బోధిధర్మ తైక్వాండో అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచడం హర్షణీయమన్నారు. ఈ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన క్రీడాకారులు ఆగష్టు 16 నుంచి 18వ తేదీ వరకూ ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పలు పతకాలు సాధించిన విద్యార్థులను బొలిశెట్టి రామకృష్ణ, ఇంద్రగుప్తా, కోచ్ రోహిత్ వర్మ తదితరులు అభినందించారు.

వేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న బ్రహ్మణ సమాఖ్య సభ్యులు

బాపట్లటౌన్: విద్యార్థి దశ నుంచే పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని భావపురి బ్రహ్మణ సమాఖ్య కార్యవర్గ సభ్యులు సోమరాజు శ్రీనివాస్ సూచించారు. గురు పూర్ణిమను పురస్కరించుకొని సోమవారం భావపురి బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలోని శంకరవిద్యాలయ ప్రాంగణంలోని వేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. 2023-24లో 10వ తరగతి, సీనియర్ ఇంటర్ పరీక్షల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. వెదుళ్లపల్లిలోని వేదపాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భావపురి బ్రాహ్మణ సమాఖ్య కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్, కొలను మోహన్, రామారావు, హరనాథ్ శర్మ, నారాయణ, బందా బాబు, చిలకమర్తి శర్మ, భట్టు, పద్మవల్లి తదితరులు, శంకరవిద్యాలయ కార్యదర్శి బాబూ నాగేంద్ర, చలపతిరావు, భుజగేంద్రమౌళి పాల్గొన్నారు.

ఘనంగా శిక్షా సప్తాహ్



శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో తయారు చేసిన బోధన సామగ్రి ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చెరుకుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం సమగ్రశిక్ష ఆధ్వర్యంలో శిక్షా సప్తాహ్ వారోత్సవాలు గుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం పి.కవిత మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ)2020 నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 22 తేదీ నుంచి 29 వరకు వారం రోజుల పాటు శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. అందులో భాగంగా సోమవారం మొదటి రోజు స్థానిక వనరులతో విద్యార్థులు పోటీపడి ఉపాధ్యాయులు బోధన, సామగ్రిని తయారు చేసి ప్రదర్శించారు.